
# వర్షం

## నందం రామారావు



'చాలా రోజులుకొచ్చావే సత్తిరాజా!'

'ఇవ్వాళెక్కడున్నుంచొస్తున్నావు?'

'ఏందుకని రావడంలేదు?'

సత్తిరాజా చుట్టూ ఐదుగురు ఆడవా ళ్ళున్నారు?

వాళ్ళ ముందర అనేకరంగుల చీర లున్నాయి. ఆ చీరలు అందంగా వున్నాయి. చూడముచ్చటగానూ వున్నాయి.

'ఈ చీరెంత సత్తిరాజా?'

సత్తిరాజా ఆ చీరను చూశాడు.

ఆ చీర గులాబీ రంగు మీద నచ్చ బోర్డరుండి లేతగ్గా వుంది.

ధర చెప్పాడు.

'అబ్బో! ఏమిటి ధర చాలా చెబు తున్నావ్?'

'లేదమ్మగారు! క్రితంసారికూడా ఇదే ధరకొన్నారు. కాకపోతే రంగు తేడా. మీ దగ్గర ఎక్కువ తీసుకుంటానా?'

'ఆ మాటలకేం వుందిలే. చెప్పు. చెప్పు!'

'లేదండి. గిట్టుబాటు కాదు.'

'రంగుంటుందా?'

'వుంటుందండి.'

'సరే ఇంటికిరా డబ్బిస్తా. ఏమేవ్ గంగా! వస్తావ్. నువ్వూ తీసుకుంటు న్నావా?'

ఆమె చీర తీసుకెళ్ళిపోయింది.

'ఇదిగో సత్తిరాజా! ఈ చీర ఏంటో చెప్పు.'

రూబీ రంగుచీరమీద అంతా బుటా.

'ఈ చీర మీకు బావుంటుందండి. ఈ రంగులో నాలుగు చీరలు తీసుకొచ్చాను. ఐపోయాయి. ఇదొక్కటే మిగిలింది.'

'సత్తిరాజుదగ్గర చీరలు చూడటం కొనకుండా వెళ్ళడమూనా?'

సత్తిరాజా నవ్వుకున్నాడు.

ఆరోజు అతను చాలా చీరెలు అమ్మాడు. బాగానే గిట్టుబాటయింది.

సత్తిరాజా చీరెలన్నీ శుభ్రంగా మూట కట్టాడు. కుర్రాడి నెత్తిమీద ఆ మూటను పెట్టి—

'ఒరేయ్! నువ్వు సుందరమ్మగారింటి కెళ్ళి, మూట వారింట్లో ఇచ్చి, నువ్వింటి కెళ్ళిపో. తెల్లవారేసరికి వచ్చేయి. నేను సాయంత్రానికి మా వూరెళ్ళిపోతాను' అన్నాడు.

సత్తిరాజా భోజనం చేసి సుందరమ్మ గారింటికొచ్చాడు.

ఆ ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుంది. బయట తాళంకూడా వేసి లేదు.

సత్తిరాజా వెళ్ళి తలుపు తట్టాడు. కాస్సేపట్లో తలుపు తీసుకుని సుందరమ్మ వచ్చింది.

'కుర్రాడు బట్టలమూట ఇచ్చాడాండీ!' అన్నాడు.

'ఇచ్చాడు. లోపల పెట్టించాను. కావాలా?'

'వద్దండి.'

'ఇవేళేమాత్రం అమ్మావ్?'

'బాగానే అమ్మానండి. అంతా మీ దయ. ఈవూరికి మొదటిసారిగా వచ్చి నప్పుడు, నాదగ్గర కొని నాకో దారి చూపించారు. మీ అభిమానంవల్ల బాగానే వున్నామండి.'

సుందరమ్మ పొంగిపోయింది.

'ఈ ఆరొందలూ మీ దగ్గరుంచండి. రేపెళ్ళేటప్పుడు తీసుకుంటాను' సత్తి రాజా లెక్కపెట్టి ఆమెకిచ్చాడు.

సుందరమ్మ లోపలకెళ్ళింది.

సత్తిరాజా చాప దులిపి పక్క వేశాడు అరుగుమీద. కాసేపట్లో సుందరమ్మ సత్తిరాజుదగ్గరకు మజ్జిగ గ్లాసుతో వొచ్చి—

'తీసుకో' అన్నది.

'భోజనం చేసొచ్చానండీ.'

'పర్లేదు. తీసుకో'

'అయ్యగారు లేరాండీ?'

'పొలంలో కుప్పతీశారు. ఈ రాత్రికి రారు' అప్పటికి చాలా పొద్దుమయింది. వూరంతా నిద్రపోతోంది. ఎక్కడో దూరాన కుక్కొకటి అరుస్తోంది. కీచురాళ్ళు వికృతంగా అరుస్తున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు ఛమక్ ఛమక్ మంటున్నాయి. ఈదురుగాలి వీస్తోంది. మబ్బులు పడుతున్నయి. ఏ క్షణంలోనైనా వర్షం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

సత్తిరాజా పడుకున్నాడు. అతనికి నిద్ర రావడం లేదు! ఈ పాటికి భార్యా, కొడుకూ భోజనాలు చేసి పడుకుంటారు. తను లేని మంచంకేసి భార్య దిగులుగా చూస్తుంటుంది. కొడుకుని బాగా చదివించాలి. తనలాటి బతుకు వాడికి కలగనీయకూడదు. తను జీవితాన్ని గురించి ఎన్ని కలలుగన్నాడు! అన్నీ కూలిపోయాయి. తన బంగారు జీవితాన్ని నాన్న తినేశాడు! నాన్న... అవును నాన్నే...అతి దారుణంగా తినేశాడు!

# వర్షం

'నాయనా సత్తిరాజా! ఇంక నే చదువు చెప్పించలేను. నా వల్లకాదు. మన నేత పని నేర్చుకో. మనకు లోటుండదు. ఈ వృత్తి వున్నంతకాలం మన బతుకులు హాయిగా గడచిపోతాయి. వృత్తిని నమ్ముకోడం ఎప్పటికైనా మంచిదే. నా మాట కాదనకు. నేను పండిపోయాను. రాలిపోతాను!' నాన్న కళ్ళల్లో కన్నీళ్ళు నిలిచాయి.

తను మాట్లాడలేకపోయాడు. పై చదువులు చదవడానికి నోచుకోలేకపోయాడు. ఆ సంవత్సరమే నాన్న చనిపోయాడు! తప్పనిసరై, గత్యంతరంలేక పరిస్థితులకు లొంగిపోయాడు! తన ఆశలూ, కోర్కెలూ అన్నీ కూలిపోయాయని బాధపడ్డాడు. బ్రతుకుతెరువుకోసం వృత్తిపని నేర్చుకోక తప్పలేదు!

రెండో సంవత్సరం పెళ్ళి చేసుకున్నాడు.

భార్య ఎటువంటిదోనని భయపడ్డాడు.

అతనికి అనుకూలవతైన భార్యే లభించింది.

ప్రొద్దునే లేచి అన్ని పనులూ చేసేది. భర్తక్కావలసిన సహాయం చేసేది. సలహాలిచ్చేది. వాళ్ళ దాంపత్యం సుఖంగా, ఆనందంగా సాగిపోతోంది.

మరో సంవత్సరానికి వారికో యువరాజా కలిగాడు.

పదేసిరోజులిలా పరాయి వూళ్ళల్లో భార్యనూ, కొడుకునీ వదలిపెట్టి వుండడం సత్తిరాజుకూ విచారంగానే వుండేది!

'మీరిలా తిరగడం బావుండలేదు!' అనేది సుభద్ర.

'మరెలా?' నవ్వేవాడు.

'మీరెప్పుడూ నాదగ్గరే వుండాలి. మిమ్మల్నొదిలి వుండాలంటే నాకు చాలా భయంగా వుంటోంది!'

'పిచ్చిదానా! మరి జీవితాలు గడిచేదెలా? బాబుకు బాగా చదువు చెప్పించాలా. వాడు పెద్దవాడై ఉద్యోగం చేసేటప్పుడు ఇద్దరం ఒకేచోట వుందాం. సరేనా?' భార్య బుగ్గమీద సున్నితంగా చేతులు వేసేవాడు.

సుభద్ర బోల్డు సిగ్గుపడిపోయేది.

సత్తిరాజా తృప్తిగా నవ్వుకున్నాడు.

చలిగావుంటే నిండా దుప్పటి కప్పుకున్నాడు.

ఆకాశంలో మబ్బులు దట్టంగా పేరుకున్నాయి.

ఈదురుగాలి బలంగా వీస్తోంది. వీధిలో స్ట్రీట్ లైట్స్ ఆరిపోయాయి. ఆ దారంతా చీకటిగా వుంది.


సత్తిరాజా ముడుచుకు పడుకున్నాడు. అయినా, చలి ఎముకల్ని కొరికేస్తోంది. ఆ అరుగుమీద ఎటువంటి ఆచ్ఛాదనా లేకపోవడంవల్ల ఈదురుగాలి శబ్దం వింతగా వుంది. కీచురాళ్ళ శబ్దం—ఒక వున్మాది నిదట్లో వికృతంగా అరచినట్టుగావుంది.

అనుకున్నట్టుగా వర్షం వచ్చేసింది. చిన్నదిగా కాదు. బ్రహ్మాండంగా వొచ్చేసింది. ఉరుములూ, మెరుపులూ, గాలి. ఎక్కడా ఏమీ కనుపించడంలేదు.

వర్షం అరుగుమీద పడుతోంది. సత్తిరాజా దిగ్గున లేచాడు. చాప చుట్టాడు. గోడ కానుకుని బయటకు చూస్తుండిపోయాడు!

అంతా అంధకారం. నింగీ, నేలా, చెట్లూ అన్నీ ఆ చీకట్లో కలిసిపోయాయి. సర్వం చీకటిముద్దలా వుంది. ఒక్కసారిగా మెరిసింది. ఆ మెరుపులో నేలంతా జలమయంగా వుంది. రోడ్లు మునిగిపోయాయి.

సత్తిరాజా సుందరమ్మను లేపుదామని



కున్నాడు. నగంప్పైగా తడిసిపోయాడు! మరికాసేపు ఆ అరుగుమీదుంటే పూర్తిగా తడిసిపోతాడు!

సత్తిరాజు కెందుకో ఆమెను లేప బుద్ధి కాలేదు.

ఈ అర్ధరాత్రి సమయంలో ఆమెకు ఇబ్బంది కలిగించడం అతనికి ఇష్టంలేక పోయింది.

తనీ వూరొచ్చినప్పుడల్లా పడుకోడాని కింత చోటిచ్చి చాపా, దుప్పటిస్తోంది. తెలిసినవారందరిచేతా చీరలు కొని పిస్తోంది. ఆమె అభిమానంతో తన సంసారం సుఖంగా గడచిపోతోంది.

సుందరమ్మ ఎంత మంచిది!

ఇప్పుడా ఇంటి తలుపులు తెరచుకున్నాయి.

సత్తిరాజు తలెత్తి చూశాడు.

దీపం బుడ్డి పట్టుకుని ఎదురుగా సుందరమ్మ!

'సత్తిరాజా? వర్షంలో తడిసిపోతున్నావు. లోపలకొచ్చి పడుకో' అన్నది.

'అబ్బే! ఏందుకలడి. పర్లేదు.'

ఆమె నవ్వి—

'ఇలా తెల్లవార్లూ వర్షంలో తడుస్తావా? భలేవాడివి. లే.లే' అన్నది.

సత్తిరాజు చాపా దుప్పటి తీసుకుని లోపలకొచ్చాడు.

'ఇంత పెద్ద వర్షం వస్తూ చలిగాలి వీస్తుంటే లేపకుండా ఏం చేద్దామని?'

సత్తిరాజు మాట్లాడలేదు. ఒకప్రక్కన బెంచీ వుంది. అక్కడకెళ్ళి దానిమీద కూర్చున్నాడు.

సుందరమ్మ దీపం బుడ్డి హాల్లో పెట్టింది. ఒకసారి గదిలోకి వెళ్ళింది.

సత్తిరాజు ఆ బెంచీమీద చాప పరిచాడు. పడుకోబోతుండగా సుందరమ్మ వొచ్చింది.

'అదేమిటి సత్తిరాజా! అక్కడ పడుకుంటావ్?'

అతను పడుకోబోయేవాడల్లా లేచి కూర్చున్నాడు.

బయట వర్షం ఇంకా కురుస్తూనే వుంది. చలిగాలికి చేతులు వంకర్లుపోతున్నాయి. శరీరం యావత్తూ మంచులో కూర్చున్నట్టుగా వుంది.

'ఆ గదిలోకొచ్చి పడుకో సత్తిరాజూ!?' అన్నది సుందరమ్మ.

'ఇక్కడ బాగానేవుందండి.'

'ఈ ఇల్లు నీకు కొత్తదికాదు. ఏందుకలా సిగ్గుపడతావ్. వొచ్చి ఆ గదిలో పడుకో' అంటూ చొరవగా సుందరమ్మ అతని చేతులు పట్టుకుంది.

సత్తిరాజు ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపోయాడు.

తలెత్తి చూశాడు. సుందరమ్మ నవ్వుతోంది!

సుందరమ్మ అతన్ని ఆ బెంచీమీద నుంచి లేపింది.

అతనిచేతులు పట్టుకుని గదిలోకి తీసుకెళ్ళింది.

సత్తిరాజు మాట్లాడలేకపోయాడు. యాంత్రికంగా ఆమెను అనుసరించాడు.

'కూర్చో' అంటూ అతన్ని మంచం మీద కూర్చోబెట్టింది.

ఇదంతా సత్తిరాజుకు విచిత్రంగా వుంది. కలలోలా వుంది.

నమ్మలేనిదిగా వుంది!

'ఏమిటలా చూస్తున్నావు?' అన్నది నవ్వుతూ.

సత్తిరాజు విభ్రాంతిగా ఆమెను చూశాడు.

సుందరమ్మ చాలా అందంగా వుంది. ఖరీదైనచీర కట్టింది, తల్లో మల్లెపూలు వెక్కిరిస్తున్నాయి. ఆమె కళ్లల్లో కోర్కెలు కవ్విస్తున్నాయి. గులాబీల పరిమళం ఆశలు కలిగిస్తోంది. ఎర్రని అధరాలు చిలిపిగా వెక్కిరిస్తున్నాయి. అప్పుడామె దేవతలా మెరిసిపోతోంది!

కిటికీలు టబదబా కొట్టుకున్నాయి. వర్షం పడుతూనే వుంది. చలిగాలి రివ్వున వీస్తోంది. కిటికీలోంచొచ్చిన మెరుపులో సుందరమ్మను చూసి సత్తిరాజు అదోలా అయిపోయాడు.


ఆమె లేచివెళ్ళి కిటికీ మూసేసింది. వొచ్చి సత్తిరాజు పక్కన కూర్చుంది. ప్రేమగా అతని వీపుమీద చేయి వేసింది. ఆ తర్వాత అన్నది—

'ఎందుకలా ఖంగారుపడతావ్? నేనందంగా లేనా?'

సత్తిరాజుకి అయోమయంగా వుంది. ఆమె స్పర్శ వెచ్చగా వుంది. గగుర్పాటు వుంది. నరాలన్నీ ఉద్రేకంగా కొట్టుకుంటున్నాయి. వెన్నులోంచి ఏదో జరజరా పాకుతోంది. తను నిలువలేకపోతున్నాడు. ఎక్కడో అందని లోకంలో విహరిస్తున్నట్టుగా వుంది!

ఆ సమయంలో దూరంగా ఎక్కడో పెద్ద శబ్దం చేస్తూ పిడుగు పడింది. ప్రళయం విరిగి మీదపడినట్టు సత్తిరాజు ఉలిక్కిపడ్డాడు!

'సుందరమ్మగారూ!' అన్నాడు.



"ఈ రాత్రిని రాతిగా చేయకు సత్తి రాజూ! బయట చూడు ఎలా వుందో. ఈ రాత్రి మనకోసమే.'

'మీరు...'

'మాట్లాడకు సత్తిరాజూ! ఇప్పుడు నేను నీదాన్ని...'

సత్తిరాజు ఆమె ముఖంలోకి చూశాడు.

* * *

సత్తిరాజుకు భార్య గుర్తుకొచ్చింది. భార్యకు తనమీదున్న ప్రేమ గుర్తుకొచ్చింది. తప్పటడుగులు వేస్తూ నడుస్తున్న కొడుకు గుర్తుకొచ్చాడు. ముద్దు ముద్దుగా మాట్లాడుతున్న వాడి ముఖం గుర్తుకొచ్చింది.

వీళ్ళందరూ తన్ను నమ్ముకున్నవారు. వీళ్ళందరికీ అన్యాయం చేశాడా? రాత్రి జరిగిన సంఘటన భార్యకు తెలిస్తే తన ముఖం చూస్తుందా? సుభద్రకు తీరని అన్యాయం చేసినవాడవుతాడా? రాత్రెందుకిలా జరిగింది?

అప్పుడతనికి భార్య తన కళ్ళెదుట దీనంగా నుంచున్నట్లనిపించింది. అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

సత్తిరాజు బట్టలు సర్దుకున్నాడు. చీరలమూట తీసుకున్నాడు. కాసేపు ఆ ఇంటికేసి చూశాడు.

సుందరమ్మ కనిపించలేదు!

అతను గబ గబా బయటకొచ్చి నడవ సాగాడు.

* * *

ఒక చిన్న స్టేషన్లో బండి ఆగింది.

అంత పెద్ద రైల్లోంచి సత్తిరాజు ఒక్కడే దిగాడు?

అతను బయటకొచ్చాడు.

అప్పటికి రాత్రి పదకొండు గంటలు దాటింది. కూలీలు ఎవరూ లేకపోవడం వల్ల చీరల మూటను తనే మోసుకున్నాడు.

ఆ దారంతా చీకటి కురుస్తోంది. రోడ్డు ప్రక్కనున్న చెట్టుపుల్లోంచి కప్పలు అరుస్తున్నాయి. నల్లని మేఘాలు ఆకాశంనిండా కప్పుకున్నాయి. ఉరుములూ మెరుపులూ పోటీ పడుతున్నాయి. ప్రాణం పోతున్న మనిషి ఒక్కసారిగా లేచి గావుకేక పెట్టినట్లు కుక్కలు యేడుస్తున్నాయి. చలిగాలి వీస్తోంది. వర్షం రావడానికి సిద్ధంగా వుంది. సత్తిరాజు గబ గబా నడవసాగాడు.

అతనికీ వాతావరణం—సుందరమైన, మనోహరమైన ఉద్యానవనంలో విహరిస్తున్నట్లుగా వుంది. కాసేపట్లో సుభద్ర కౌగిలిలో ఇమిడిపోతాడు.

ఆ వెంటనే అతనికి రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది!

'సుందరమ్మా' అనుకున్నాడు బాధగా.

సత్తిరాజు ఇంటికొచ్చాడు. అరుగు మీద బట్టలమూట పెట్టాడు.

సుభద్రను పిలిచాడు. తలుపులు తెరచుకోలేదు.

భార్య నిద్రపోతుందేమో ననుకున్నాడు.


కాలర్ మొదలుకొని కఫ్‌లవరకు, కత్తిరింపు మొదలు తగిన గుండీల ఎన్నిక వరకు...



షర్ట్‌గాని, ఫ్రాక్‌గాని తయారు చేయటం నేడొక కళ

40 ఏళ్లకు పైగా ఈ పరిశ్రమకు సమర్పణ మయినది శాంసన్స్




- పెద్దలకు షర్టులు, బుష్ షర్టులు, ట్రౌజర్లు—రు. 6 లు మొదలు రు. 50 లు వరకు.
- చిన్న పిల్లలకు పైజామాలు, నిక్కర్లు, షర్ట్‌లు, బుష్ షర్టులు, ట్రౌజర్లు, బాబా సూట్లు, ఫ్రాక్‌లు-రు. 3 మొదలు రు. 25 లు వరకు.
- కాటన్ టెరిన్/కాటన్ షర్టులు, మీడియం—ఫైన్ కాటన్ ట్రౌజర్లు, టెరిన్/కాటన్ ట్రౌజర్లు పాప్లిన్, డిప్-డై, చేనేత—అద్దకపు బుష్ షర్టులు, మరియు షర్టులు.
- సంకీర్ణమైన ప్రింట్‌లు, మనోహరమైన ప్లెయిన్ రంగులు, నదరైన చారలు, చెక్స్.

SAMSONS DRESSES
for men's and boys' wear and hosieries

ది బెంగళూర్ డ్రెస్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు-27.

# వర్షం

కిటికీ దగ్గరకెళ్ళి [illegible] అతను కిటికీ దగ్గరకెళ్లాడు. మూసి వున్నాయి.

'సుభద్రా' అని పిలవబోయాడు.

అప్పుడతనికి ఏవో కొన్ని మాటలూ, నవ్వులూ వినిపించాయి.

సత్తిరాజు ఒక్కక్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు. ఆ తర్వాత కోపంతో రెచ్చిపోయాడు.

'మీ ఆయనొస్తే?'

'ఆయన రాడు.'

'ఏం?'

'అదంతే.'

'నువ్వు చాలా అందంగా వున్నావు!'

సుభద్ర గర్వంగా నవ్వింది!

ఆ తర్వాత మాటలు సత్తిరాజు వినలేదు. కోపంతో, అసహ్యంతో ముందుకు వెళ్ళి తలుపు బద్దలుకొడదామనుకున్నాడు.

తను అమితంగా ప్రేమించిన భార్య! అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య! పరాయి మొగాడితో—

ఇది భరించలేడు.

ఒకే ఒక పాపపు సంఘటనతో తన బ్రతుకంతా నాశనమయింది!

సత్తిరాజు తలుపు మీద చేయి వేయబోయాడు.

ఆచేతులు తలుపుమీద పడ్డాయా? ఈ రోజుతో వాళ్ళ జీవితాలు పరిసమాప్తి!

అప్పుడతనికి వెన్నుమీద ఎవరో బలంగా చరచినట్టుగా, ఇది కూడదని కర్తవ్యాన్ని బోధించినట్టుగా అనిపించింది. రాత్రి జరిగిన ఒకానొక సన్నివేశం అతని కళ్ళముందు కదిలింది. అప్రయత్నంగా అతని చేతులు జారిపోయాయి!

'సుభద్రా!' అంటూ తలుపుమీద చిన్న శబ్దం చేశాడు.

కాస్సేపట్లో తలుపు తెరచుకున్నాయి.

'మీరా!' అంది సుభద్ర.

సత్తిరాజు మాట్లాడకుండా లోపలికెళ్లాడు.

మంచంమీద కొడుకు నిద్రపోతున్నాడు. కొడుకుని చూడగానే, ఎవరో బలంగా సుత్తితో అతని గుండెల్ని మ్లల గొడుతున్నట్టుగా అయిపోయాడు!

'ఎవడు వాడు?'

'................'

'వాడికీ, నీకూ — ఏమిటి సంబంధం?'

'ఏమిటి మీరంటున్నది?'

'తిక్కగా మాట్లాడకు. నన్ను బుకాయించొద్దు. నన్నెందుకిలా మోసం చేశావ్?'

'మీరనవసరంగా...'

సుభద్ర చెంప చెళ్ళుమంది!

'నువ్వు నా కష్టాల్లో సుఖాల్లో భాగం పంచుకున్న భార్యవనుకున్నాను. నా అంతటి అదృష్టవంతుడు లేడని మురిసిపోయాను. ఈ రోజే నిజం బయటపడింది. ఎందుకు సుభద్రా! ఎందుకిలా ప్రవర్తించావ్?' కంఠం చలితో వణికింది.

ఆమె మాట్లాడలేదు. తలొంచుకుని భర్తకెదురుగా నుంచునుంది.

'సుభద్రా! నీమీదా బాబుమీదా ఎన్నో ఆశలు పెంచుకున్నాను. అవి కూలిపోతే నేను భరించలేను. ఇంకెప్పుడిలా ప్రవర్తించకు.'

సత్తిరాజు బయటకొచ్చాడు. గోడ కానుకుని కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళలో కన్నీళ్ళు నిలిచాయి.

అవును! ఈలోకంలో తప్పు చేయనివారుండరు. కొందరు తెలిసి చేస్తారు. మరికొందరు ఊహించక చేస్తారు. కొన్ని ప్రకృతిశక్తుల ప్రేరేపణవల్ల జరిగిపోతాయి. అంతమాత్రాన మనిషి నిజ స్వరూపం ఇదని చెప్పలేం. సుభద్ర కూడా మనిషే. ఎక్కడో ఏదో లోపం జరిగింది. అర్థంకాని అయోమయపు బలహీనతకు లొంగిపోయింది! నిజం ఇది!

రాత్రి తనకేం జరిగింది! అలా జరుగుతుందని తనేమైనా ఊహించాడా? ఆ రకమైన వాతావరణం ముందేమైనా కనిపించిందా?

ఉరుముల్లో, మెరుపుల్లో, ప్రచండమైన వర్షంలో, కారుచీకట్లో... సుందరమ్మ... తనను బతిమలాడింది. బుజ్జగించింది.

ఆ సమయంలో తను ఏదోలా అయిపోయాడు. ఒకే ఒకక్షణం తను పతనమవడానికి! అప్పుడు తన భార్య నిండుగా, తన కళ్ళముందు సాక్షాత్కరించింది. సుందరమ్మను విడిపించుకుని తలుపులు తీసుకుని గబగబా బయటకొచ్చేశాడు!

క్షణికమైన వ్యామోహానికి లోబడి భార్యకు అన్యాయం చేయలేకపోయాడు. అందుకు మనసు అంగీకరించలేకపోయింది!

ఇప్పుడు తన భార్య విషయం నలుగురికీ తెలిస్తే... తను తలెత్తుకుని తిరగ్గలడా? తన బాబుకి భవిష్యత్తుంటుందా? తను చూసిన ఈ పాపపు సంఘటన తన గుండెల్లోనే వుండిపోవాలి.

* * *

ఒకానొక రాత్రి జరిగిన విచిత్రమైన సన్నివేశం—

సత్తిరాజు బాబుని వొడిలో కూర్చోపెట్టుకుని కూర్చున్నాడు. అతనిముందు పుస్తకాలున్నాయి. సత్తిరాజుని ఆనుకుని ఒక యువతి కూర్చునుంది.

'ఇవేళ్టికింక చాల్లేండి. చాలా రాత్రయింది' అంటూ బాబుని ఎత్తుకుంది.

ఆ దృశ్యాన్ని కిటికీలోంచి రూపుమాసిపోయి, చిక్కిపోయిన ఒకామె చూసింది.

'అవును! ఈ ఇంటికీ నాకూ ఋణం తీరిపోయింది.

'నాకింకిక్కడ స్థానం లేదు!'

అడుగులు వేసుకుంటూ ఆ చీకట్లో కలిసిపోయింది!

* * *

ఆ మాటలు సత్తిరాజు వింటే ఏమయ్యేదో తెలీదు! కానీ, అతను వినలేదని మాత్రం తెలుసు. ఎందుకంటే సుభద్ర ఆ మాటలు మనసులోనే అనుకున్నది గనుక! ●

